# గడుసుతనం

-భాగవతుల రామారావు

కొడుకు కోర్టుకి వెళ్లడానికి సిద్ధం అవుతున్నాడు. తొందరగా వంట చేస్తోంది సీతారత్నమ్మ. తీరా చూస్తే ఉప్పు నిండుకున్నది. ఇప్పుడు ఉప్పు తెమ్మని చెబితే అబ్బాయి టైము లేదని విసుక్కుంటాడు. వంట మొదలెట్టేక చెబితే ఇవాళ వంట అయినట్టే- అని తిండి తినకుండా కోర్టుకి వెళ్లిపోతాడు.

అంచేత గుట్టుచప్పుడు కాకుండా పెరట్లోకి వెళ్లి పిట్టగోడ మీంచి పక్కింటి పంకజాక్షిని మందస్వరంతో పిల్చింది.

నిజానికి సీతారత్నమ్మ ఇరుగు పొరుగు అమ్మ లక్కల్ని ఉబ్బించి ఊరించి ఏదో ఒకటి వంటింటి సరుకు ఎరువు తెచ్చి పబ్బం గడుపుకోవడం ఆమె నైజం.

వంటింట్లో ఉన్న పంకజాక్షి సీతారత్నమ్మ గారి పిలుపు విని పెరట్లోకి వచ్చింది. "ఏమిటి పిలిచేరా పిన్నిగారూ?" అని అడిగింది.

"ఏం లేదు పంకజం. అబ్బాయికి కోర్టుకి టైమ యింది. నా మతిమరుపు మండ- ఉప్పు నిండుకుందని ముందు చూసుకోలేదు. వంట మొదలెట్టి ఇప్పుడు ఉప్పుతెమ్మని చెబితే కస్సుమంటాడు అబ్బాయి. చచ్చి నీ కడుపున పుడతాను- ఇదిగో ఈ గ్లాసుడు ఉప్పు అప్పిద్దూ. సాయంత్రం తెప్పించి నీ ఉప్పు పువ్వుల్లో పెట్టి ఇచ్చేస్తాను"

"దానికేమిటి పిన్నిగారూ! మీరడిగింది ఉప్పు. వెండీ, బంగారం కాదు కదా? అవసరం అన్నది ఎవరి కైనా వస్తుంది. చిన్నవాళ్ళం మాకే మతిమరుపు ఎక్కువ. ఈ వయసులో మీరు ఇంకా ఒంటి చేతిమీద మారు సాయం లేకుండా ఇల్లు నెట్టుకొస్తున్నారు. మీ వయస్సుకి మేం మంచాలెక్కిపోతాం. మీ అబ్బాయికి పెళ్లయేదాకా మీకీ తిప్పలు తప్పవు... ఏదీ, ఆ గ్లాసివ్వండి ఉప్పిస్తా."

పంకజాక్షి గళాసు తీసుకుని, వంటింట్లోకి వెళ్లి, గ్లాసు నిండా ఉప్పు నింపి, గోడమీంచే సీతారత్నమ్మకి అందించింది.

"నా తల్లే! అడగ్గానే ఇచ్చేవ్. వస్తాను. అబ్బాయికి వంట లేటయిపోతుంది."

అన్నప్రకారం సీతారత్నమ్మ ఆ సాయంత్రమే పంకజాక్షికి ఉప్పు అప్పు తీర్చలేదు. తెచ్చిన వస్తువు వెంటనే తిరిగి తీర్చడం ఆవిడ స్వభావానికి విరుద్ధం.

రోజూ మధ్యాహ్నం ఎండ చల్లబడ్డాక ఆ వీధి అమ్మ లక్కలందరూ సీతారత్నమ్మ గారింట్లోనే పిచ్చాపాటీ వేసుకుంటారు. కారణం- సీతారత్నమ్మ గారబ్బాయి కోర్టుకి వెళ్లిపోయేక సాయంత్రం దాకా వారిల్లు ఖాళీ.

రోజూ కలుస్తారన్న మాటేకాని వాళ్లు మాట్లాడుకునే వన్నీ పొల్లు కబుర్లూ, ఇచ్చకాలే. లేదా, ఏ రోజున ఏ సభ్యురాలు రాదో అవేళ వాళ్లు విచ్చలవిడిగా ఆ ఇల్లాలు మీద ఉన్నవీ లేనివీ చిలవలూ పలవలూ అల్లి ఆమె మీద చాడీలు చెప్పుకుంటారు. వాళ్లందరికీ తెలుసు- రేపు వాళ్లల్లో ఎవరు ఏ కారణం చేతేనా మధ్యాహ్నం ఇష్టాగోష్ఠికి రాలేకపోతే ఆమె మీద కూడా అందరూ అవాకులూ చెవాకులూ చెప్పుకుంటారని. అయినా అదే వాళ్ల కానందం!

సీతారత్నమ్మ వారం రోజులు పోయాక ఉప్పు అప్పు తీర్చడానికి పెరటి గోడ దగ్గరికొచ్చి పంకజాక్షిని పిలిచింది.

"ఏం కావాలి పిన్నిగారూ?" అంటూ పంకజాక్షి పెరట్లో కొచ్చింది.

"ఏమీ వద్దమ్మామ్. నీ ఉప్పు అప్పు తీర్చలేదు కదా? అందుకు పిలిచేను. ఇదు! నీ ఉప్పు తీసుకో" అని నిండా ఉప్పునింపిన పలకల గ్లాసు అందించింది.

ఆ గ్లాసు చూడగానే పంకజాక్షి "పిన్నిగారూ! మీరు అవేళ ఉప్పు పట్టుకెళ్లింది ఈ గ్లాసుతో కాదు. అది దీనికంటె చాల చిన్నది. దానికి పలకలు లేవు" అంది.

"అయ్యో రామా! నేనే మతిభ్రష్టి ననుకుంటే నాకంటే నీకు మరీ మతిమరుపెక్కువలా ఉందే అమ్మాయ్! అప్పు ఇచ్చిందానివి నువ్వు దేంతో ఇచ్చేవో మరిచిపోవచ్చు. అప్పు తెచ్చింది మా గళాసుతో గనక నాకు తెలీదా దేంతో తీసుకెళ్లేనో?"

"లేదండి పిన్నిగారూ! మీరు అవేళ ఇంతకన్న చిన్న గ్లాసుతో పట్టుకెళ్లేరు. ఆ గ్లాసు కంటె ఇది రెండు రెట్లు పెద్దది. తక్కువ ఇచ్చి, ఎక్కువ తీసుకోవడం తప్పు కాదూ? పెద్దవారు మీరు, దేంతో పట్టుకెళ్లేరో మరిచి పోవచ్చు. అలా అని ఉప్పు కోసం కక్కుర్తి పడతానా? నాకు మాత్రం అరుబలం కావొద్దూ?" అంది పంక

జాక్షి.

సీతారత్నమ్మ తాపట్టిన కుందేలుకి మూడేకాళ్లన్నట్టు "హయ్యో.. ఖర్మ! ఎంత వెర్రిబాగులదానివే అమ్మాయ్. నేనంటే మతిమాలిన ముసలిముండని. ఇంత చిన్న వయసులో నీకు ఇంత మతిమరుపయితే ఎలా సంసారం నెట్టుకొస్తావో! లేక, అప్పిచ్చింది ఉప్పే కదా, తిరిగి పిన్నిగారి దగ్గిర పుచ్చుకోవటమేమిటని మొహమాట పడుతున్నావా? సంసారం గుల్లయిపోతుంది సుమా! నేనింకేదేనా మరిచిపోతానేమో కాని ఎరువు తెచ్చిన వస్తువు చస్తే మరిచిపోను. కాక, ఎక్కువ పుచ్చుకుని తక్కువ తీర్చడం మా ఇంటా వంటా లేదు. పిసరంత ఉప్పుతో నువ్వు బంగారం గోడలు కట్టలేవు, నేనూ దివాలా ఎత్తిపోను. మరి మారు మాటాడకుండా నేనిచ్చింది తీసుకో. పెద్దదాన్ని, నా మాట కాదనకు" అని బలవంతపెట్టింది.

మనసు పీకుతున్నా పెద్ద గ్లాసుడు ఉప్పు తీసుకోక తప్పలేదు పంకజాక్షికి.

మర్నాటి మధ్యాహ్నం మహిళా పార్లమెంటులో ఇదే ప్రధాన చర్చనీయాంశం. సీతారత్నమ్మే, పంకజాక్షి ఎదుటే ఎత్తిందీ విషయం– "మా పక్కింటి ఈ పంకజం ఉందే ఒట్టి వెర్రిబాగుల్ది. ఎలా సంసారం లాక్కొస్తుందో ఏమిటో! నేను ఈ మధ్య అప్పు పట్టుకెళ్లిన ఉప్పు నిన్న తీర్చబోతే ఎంత రాద్ధాంతం చేసిందో తెలుసా? నేను చిన్న గ్లాసుడు పట్టుకెళ్లి, మరిచిపోయి పెద్ద గ్లాసుడు తీరుస్తున్నానని ఒకటే గోల. ఈ వయసులో ఇంత మతిమరుపయితే ఎలా? దేంతో ఇచ్చిందో మరిచిపోతే ఇల్లు క్షవరం అయిపోదూ? నేను జబర్దస్తీ చేస్తే కాని తీసుకుంది కాదు" అని అందరికీ పంకజాక్షి ఎంత మతిమరుపు మనిషో రుజువు చేస్తూ, తను ఎంత నికార్సయిన మనిషో పరోక్షంగా చాటుకుంది. అమ్మలక్కలందరూ సీతారత్నమ్మ నిజాయితీని ప్రశంసించారు.

❖ ❖ ❖

ఓ రోజు వాళ్ల మధ్యాహ్నం ఇష్టాగోష్ఠిలో పెద్ద దుమారం రేపిన సంఘటన చర్చకు వచ్చింది.

సీతారత్నమ్మకి ఉండీ ఉడిగీ ఏదో ఒకటి పంకజాక్షిని అప్పు అడగడం అలవాటే కదా?

నెల్లాళ్ల కిందట సీతారత్నమ్మ ఎప్పట్లాగే పిట్టగోడ మీంచి పంకజాన్ని కేకేసింది. పంకజం "పిన్నిగారూ పిలిచేరా?" అంటూ అలవాటుగా వచ్చి అడిగింది.

"మరేం లేదమ్మాయ్. అబ్బాయికి కాఫీ పెడుతున్నాను. నాకెప్పుడూ వున్న రోగమే కదా?– ఏదీ ముందు చూసుకోను. తీరా కాఫీలో కలుపుదామంటే డబ్బాలో పంచదార లేదు! కాఫీ కోసం ఎదురు చూస్తున్న అబ్బాయిని పంచదార తెమ్మంటే అగ్గి గుగ్గిలం అయిపోతాడు. పక్కనే ఉన్నావు కదా అని ప్రతిమారూ

## గూడు చెదిరిన గువ్వలు..!

ఆకాశంలో కారుమేఘాలు కమ్మినవేళ
ఉరుములు, మెరుపుల ఫెళఫెళ ధ్వనులు!
జోరుగా కురుస్తున్న కుంభవృష్టిలో
గూళ్ళు చేరాలని గువ్వల పరుగులు..!!
ఊరిలోని పూరిగుడిసెల్లో తలదాచుకున్న
బడుగుజీవుల ఆక్రందనలు, హాహాకారాలు!
వాగులు, వంకలు పొంగి పొర్లుతున్న వేళ
అక్కడ జనజీవనం అంతా అస్తవ్యస్తం..!!
వరదల్లో చిక్కిన వాహనాల విలవిలలు
అందరి బ్రతుకులపై నిరాశ, నిస్పృహలు..!
రోదనలు, ఆవేదనలు అవి వారి గుండె చప్పుళ్ళు
సహాయ, సహకారాలకై అందరి ఎదురు చూపులు!!
అల్లంత దూరాన రక్షణ వాహనాల కదలికలు
ఆపదలో చిక్కిన వారికి అవి ఆశాకిరణాలు!
జల ప్రళయంలో దిక్కుతోచని అభాగ్యులకు
అధికారులు చేపట్టిన అరకొర సౌకర్యాలు..
అవి వారి కంటితుడుపు చర్యలకు ప్రత్యక్ష సాక్ష్యాలు!!
జరిగిపోయిన నష్టమంతా జరిగిపోయిన వేళ
నేతల విహంగ వీక్షణాల కోలాహలం...!
ప్రసార మాధ్యమాల చిత్రీకరణ దృశ్యాలు
వార్తాపత్రికల పతాక శీర్షికలు విశ్లేషణలు..!!
నాయకుల కుటిల హావభావ ప్రకటనలు, ఓదార్పులు
హంగులు, ఆర్భాటాలకే నేడు వారంతా పరిమితం..!
అంచనాలకు మించిన వ్యయం అదొక రాజకీయం..
ఎవరి కాకి లెక్కలు వారి వద్దనే పదిలం..!!
గతి తప్పిన నేటి విధివంచితులకు..
గూడు చెదిరిన మూగజీవాలకు..
నేడు ఆ దేవుడే వారికి పెద్ద దిక్కు..!!

**–తంగెళ్ల పాండురంగశర్మ**

# గణతంత్ర గీతం

పల్లవి: స్వతంత్ర భారత గణతంత్రం
వివరిస్తున్నది ఒక మంత్రం
శాంతీ, క్షమతల ఈ క్షేత్రం
సూచిస్తున్నది ఒక సూత్రం
వినరండీ వినరండి
విజ్ఞత నిలిపి వినరండి
కనరండీ కనరండి
గుండెలు తెరిచి కనరండి ॥స్వతంత్ర॥

1. పావన భూమి, పవిత్ర నేలని
వాదనలొద్దు వివాదమొద్దు
ఉత్తమ జాతి, ఉదాత్త రీతని
వైరములొద్దు వినాశమొద్దు
భూలోకంలో అణువణువూ
పూజితమేరా పునీతమేరా
మానవ మాత్రుల ఎదలన్నీ
మంచీ చెడ్డల మిళితములేరా
వీడండీ వీడండి / తేడాలన్నీ వీడండి
పాడండీ పాడండి
ఆడీ కూడీ పాడండి! ॥స్వతంత్ర॥

2. సఖ్యత లేని సమూహమేలర?
సభ్యత లేని సమాజమేల?
విలువ లేని వివేకమేలర?
వెలుగులు ఇవ్వని వికాసమేల?
భిన్నత్వంలో ఏకత్వం/భారతదేశపు ఔన్నత్యం
అందిస్తున్నది ఈ దేశం
సత్య, అహింసల సందేశం!
కలపండీ కలపండి
చేయీ చేయీ కలపండి
నిలపండీ నిలపండి
నైతిక విలువలు నిపలండి ॥స్వతంత్ర॥

3. జాతికి స్ఫూర్తి జనగణ గీతిక
స్వేచ్ఛకు మూర్తి త్రివర్ణ పతాక
నిర్మల కీర్తి హిమాద్రి పంక్తులు
సేనల శక్తి త్రిసాగరాలు
గల గల పారే నదులన్నీ
చేతన గీతిక పదనిసలు
మిల మిల మెరిసే తారకలే
ఆశయ సాధన దీపికలు!
మీటండీమీటండి/మమతలవీణలు మీటండి
నాటండీ నాటండి
బంగరు భవితలు నాటండి! ॥స్వతంత్ర॥

-గేరా

నీ మీద పడవలసి వస్తోంది. ఈమాటుకు ఈ గిన్నెతో పంచదార ఇచ్చి పుణ్యం కట్టుకో. తెప్పించగానే తిరిగి ఇచ్చేస్తాను" అంది.

"ఆ మాత్రం దానికి అంత మొహమాటపడతా రెందుకు పిన్నీ? నేనేం పరాయిదాన్నా?" అంటూ సీతారత్నమ్మ చేతిలో స్టీలు గిన్నె తీసుకుని, గిన్నె నిండా పంచదార నింపి ఇచ్చింది పంకజం.

"మా అమ్మే! అడగ్గానే లేదనకుండా ఇచ్చేవ్ అన్నపూర్ణమ్మవి!" అని పొగిడేసింది.

తెప్పించగానే ఇచ్చేస్తానన్న సీతారత్నమ్మ నెల రోజుల తర్వాత పంచదార పంకజాక్షికి ఇచ్చింది.

గిన్నె చూసి పంకజం తెల్లబోయింది. జంకుతూనే "పిన్నిగారూ! అవేళ మీరు ఇంతకంటె పెద్దగిన్నె- దానికి మట్టు ఉంటుంది- దాంతో పంచదార పట్టుకెళ్లేరు. ఈ చిన్న గిన్నెతో కాదు" అంది బెదురు బెదురుగా.

"అయ్యో! అయ్యో! ఎంత మాటన్నావ్? పెద్ద గిన్నెడు పంచదార పట్టుకెళ్లి చిన్న గిన్నెడు తీరుస్తున్నా ననా? అవ్వ! అంత కక్కుర్తి మనిషిలా కనిపిస్తున్నానా ఇవాళ నీకు? కిందటిసారి ఉప్పు అప్పిచ్చి దేంతో ఇచ్చేవో మరిచిపోయావ్. నేనే జ్ఞాపకం చేసి మరీ పెద్ద గ్లాసుతో ఇచ్చేను కదా- నువ్వు చిన్న గ్లాసుడే అని వాదించినా! నీకు మతిమరుపు ఎక్కువ. ఎక్కువ తీసుకెళ్ళి తక్కువ తీరుస్తానా? ఎంత మాట! నా ఖర్మకాలి నీ దగ్గిర అప్పు పట్టుకెళ్లేను"

"పెద్దవారు మీరు అబద్ధం ఆడుతారని అనగలనా? నాకు మాత్రం కచ్చితంగా జ్ఞాపకం ఉంది- మట్టున్న మీ పెద్ద స్టీలు గిన్నెతో ఇచ్చేను. మీరు, కాదు చిన్న గిన్నే అంటున్నారు. పెద్దలు. మీ మాటే కానీయండి. తప్పుగా మాటాడితే క్షమించండి" అంది పంకజాక్షి చిన్నబుచ్చుకుంటూ, చిన్న గిన్నెడే పంచదార తీసుకుని.

ఇదీ అవేళ వాళ్ల ఇష్టాగోష్ఠిలో దుమారం లేపిన అంశం. ఈమారూ విషయం లేవనెత్తింది సీతారత్నమ్మే. అందరూ ఆమెనే వెనకేసుకొచ్చారు. పంకజాక్షి బొత్తిగా మతిమరుపు మనిషని దుయ్యబట్టారు. అంతా తననే తప్పుపడుతుంటే పాపం పంకజం బిక్కచచ్చిపోయింది. సీతారత్నమ్మ పెదవుల మీద మందహాసం ఎవరూ గమనించలేదు.

ఇంత జరిగేక మరి పంకజాన్ని బురిడీ కొట్టడం కుదరదని సీతారత్నమ్మకి తెలుసు. అయితే పంకజం బదులు రేపు మరో చంపకం ఆమె వలలో పడుతుంది. ■